స్కెచ్:

# మాంజనేయులు మస్తిష్కం

బస్సుకోసం క్యూలో నిలబడ్డాడు ఎమ్. ఆంజనేయులు. క్యూ హనుమంతుడి తోకలా అనంతంగా పెరిగిపోతున్నది. మాంజనేయులు హుషారుగా ఉన్నాడు. వందలకొలదీ మనుష్యులు ఈ విధంగా మహానగరంలో బస్సుకోసం నిరీక్షించడంలో ఎంతో మజావుంది అనుకున్నాడు. ఈ క్యూలో నిలబడిన ప్రతివొకడూ సర్వం తెలిసినవాడివలె మాట్లాడుతాడు. థియేటర్ ప్రీజర్ గురించి ఒక పొడుగుపాటి కాలేజీ కుర్రాడు అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. ఒక తల నెరిసిపోయిన పెద్దమనిషి యోగవాశిష్ఠంలో శ్లోకాల ప్రాశస్త్యం గురించి ఇంకో ముసలాయనతో చెప్పుతున్నాడు. నైలాన్ చీర కట్టుకున్న స్నిగ్ధతేజోవతి ఎంతో కులాసాగా తన ముందున్న లలనతో ఏదో మాట్లాడుతున్నది. బాలలు, పూర్ణయౌవనలు, ప్రౌఢలు, లోలలు - ఇంతమంది స్త్రీల మధ్య నిలబడి ఈ పుష్పకవిమానంకోసం ఎదురుచూడటం జీవితంలో ఒక వింత అనుభవం. అసలు జీవితమే ఒక అనుభవాల సేకరణ అనుకున్నాడు మాంజనేయులు.

అరగంట గడిచింది. వలభయ్యయిదు నిమిషాలు కూడ విపోయింది. మాంజనేయులికి బస్సు దొరకలేదు. కాళ్లు పీక్కుడుతున్నాయి. దాహం వేస్తున్నది. "మండుటెండ నోటికొచ్చినట్టు పేలుతోంది" పదిగంటలకే. శరీరమంతా స్వేదమయం. ముఖం నల్లబడింది. వెధవ బస్సులూ, వెధవ చదువూ అనుకున్నాడు మాంజనేయులు. ఈ చదువు మానేసి ఇల్లరికం రమ్మని ఆయన సెవడో ప్రాధేయపడుతున్నాడు. హాయిగా వెళ్ళిపోతే బాగుణ్ణు. అప్పుడే వికసించిన పుష్పంలా పదహారేళ్ళ పడుచు. నగరవాసపు కృత్రిమపుటలవాట్లువిమీ లేని ముగ్ధ. తనని సాక్షాత్తూ భగవంతుడివలె పరిగణించి పూజిస్తుందని కాబోయే అత్తగారు హామీకూడా యిచ్చింది. గేదె పెరుగూ, చక్కర క్షీరమూ ఇవన్నీ సేవించి ఏ గ్రంథరాజమో పుచ్చుకుని పల్లెటూరిలో అరుగు మీద కూర్చుంటే ఎంత బాగుంటుంది! అంతగా విసుగు వేసినప్పుడు బావమరదులతో చీట్లపేక ఆడుకోవచ్చు. మరదళ్ళతో సరసాలాడవచ్చు. డబ్బుకోసం ఇప్పటివలె తడుముకోవాల్సిన అవసరం లేదు. ఎంత కావలిస్తే అంతా పిల్ల నిచ్చిన మామగారు ఇచ్చినట్టు యిస్తాడు.

బస్సువచ్చింది కోనేటిరావులా రొప్పుతూ రోజుతూ. క్యూ నెమ్మదిగా కదిలింది. మాంజనేయులికి కూర్చోవటానికి స్థలం లేదు. కాళ్లు బాగా నొప్పెడుతున్నాయి. బస్సులో ఎవరో కాలుతొక్కేశారు వేలు చితికిపోయింది. వైవాహిక జీవితంలో ఒక మాధుర్యంవుంది. తన భార్యకు తనే స్వయంగా పాఠాలు చెప్తాను. ఆమెకు

"గోపాల చక్రవర్తి"

ప్రస్తుతం తెలుగు గ్రంథాలతో మంచిపరిచయం ఉందని విన్నాడు. ఇంకేం నెమ్మదిగా ఆంగ్లభాషలోకూడ ప్రావీణ్యం వచ్చేట్లు చేస్తాడు. మహాకవుల ఉత్తమకావ్యాలగురించి తను చెప్తున్నపుడు శ్రీమతి కన్నులు ఆనంద పారవశ్యంతో మెరుస్తుగిలుతాయి. క్రమక్రమంగా శ్రీమతి సాహిత్యంగురించి విమర్శనాపూర్వకంగా తనతో మాట్లాడగలశక్తి సంపాదించుకుంటుంది................

బస్సు క్యూయంసీ దగ్గరకు వచ్చింది. చాలామంది అమ్మాయిలు దిగిపోయారు. మాంజనేయులికి కూర్చోటానికి స్థలం దొరికింది. 'అమ్మయ్య' అనుకున్నాడు అతను. ఎదురుగుండా అగాధమూ, అనంత తరంగజాలమూ అయిన సముద్రం. నీరధినితాంత నిరంతరనీలిమ అతన్ని ఎప్పుడూ కలవరపెట్టుంది. అందమైన సముద్రపుటలలు. జీవితం కలలమయం. నీగ్రోవనిత చెక్కిళ్లలా వున్న తారురోడ్డుమీద బస్సు పయనిస్తోంది. ఈనగరంలో చదువుకోవటానికి ఉన్న అవకాశాలు అపల్లెటూళ్లో ఉండవు. ఏకకాలమందు ఒకేరచయిత వ్రాసిన ఇరవై పుస్తకాలు సంపాదించాలంటే ఇక్కడే సాధ్యమవుతుంది. ఫలానా నవల మంచిదా కాదా అనే విషయం తెలుసుకోవాలనే కుతూహలం ఉంటే, తనకంటే ఎక్కువ చదువుకున్నవాళ్లని అడగవచ్చు. తెలుసుకోవచ్చు. ఆండ్రోకిలీసు ఎండ్ ది లైన్ సినిమా వొచ్చింది మొన్న. తనూ ఒకస్నేహితుడూ పని కట్టుకుని వెళ్లి ఆసినిమా చూసివచ్చారు. ఆరాత్రీ, మర్నాడుకూడ అతను షానాటకాన్నీ, ఉపోద్ఘాతాన్ని ఎన్నో సార్లు చదివాడు. షానాటకాలకే తన జీవితాన్ని అంకితం చేసిన ఒక ప్రఖ్యాత నటుడూ, ఒక కళాశాల అధ్యాపకుడూ తనూ ఈ సినిమా బాగోగులు గంటల తరబడి చర్చించారు. ఈ అవకాశాలు తనవూళ్లో ఉండవు. కాస్త కవితాపటిమా, పాండితీమహిమా, సారస్వతాభిరుచీ ఉన్నవాడికి ఈనగరంలో ఏం చెయ్యటానికైనా వీలుంటుంది. అందులో తనలాంటి బ్రహ్మచారికీ, జీవితాన్ని చక్కగా ఉపయోగించుకోగలవాడికీ, ఈ నగరం ఇచ్చే అవకాశాలు ఎక్కువ...

బస్సు లాకాలేజీదగ్గరకు వచ్చింది. దూకుడుగా క్రిందికి దిగి పెద్దపెద్ద అంగలతో కాలేజీలో ప్రవేశించాడు. అప్పుడే విద్యార్థులంతా వచ్చేశారు. గాలరీలనిండా జనం కిటకిట లాడుతున్నారు.

ఒక ఏభైమందితో సహా వరండాలో నిలబడాల్సి వొచ్చింది. లెక్చరర్ క్లాసులోకి వచ్చాడు. ఇన్ని వందల మంది పేర్లు పిలచి అటెండెన్సు తీసుకోవటం ఒక యజ్ఞం చేసినంత పని. ఇది ఒక సహస్రనామార్చన. తర్వాత లెక్చరర్ ఉపన్యాసం ఆరంభించాడు. ఒక్తే ఉక్కదంపుడు. విద్యార్థులు నవ్వుతున్నారు ఈలలు వేస్తున్నారు. పాటలు పాడుతున్నారు. ఎండ తీవ్రంగా ఉపన్యసిస్తోంది, శ్రీ శ్రీ చెప్పినట్లుగా.

మాంజనేయులికి మళ్ళీ కాళ్ళనొప్పులు ఆరంభమయింది.

దమ్మ విద్యార్థులూ, దమ్మ పరీక్షలూ ఎందుకొచ్చిన గొడవ ఇది అనుకున్నాడు. కాబోయే మామగారూ, భార్యా కళ్ళ



ముందు కన్పిస్తున్నారు. పిల్లలు ఉన్న ఇల్లు కుండే కళ వేరు. వాళ్ళ కబుర్లు వింటూ వుంటే ఇంకేమీ అక్కరలేదు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్లయి తనకు సహాయపడతారు. మనుమలతో, మునిమనుమలతో తనగృహం స్వర్గధామంలా ఉంటుంది. ఈ చదువెందుకు అనుకున్నాడు మళ్ళీ. ఈలా కోర్సు అయినతరువాత మాత్రం తన భవిష్యత్తు బాగుంటుందని అనుకోవట మెట్లా? ఉద్యోగ సమస్య అప్పుడు మళ్ళీ తలెత్తుతుంది. కొందరి ఉద్యోగసమస్యలు కాశ్మీర్ సమస్యలా ఎప్పటికీ పరిష్కారం కావు. పోనీ ప్రాక్టీసు పెట్టే! అబ్బే బోర్డు కట్టిన అయిదేళ్లవరకూ దమ్మిడీ రాదురా భాయ్ అన్నాడు మొన్న ఒక న్యాయవాది మిత్రుడు. ప్రతివాడూ అల్లాడి కృష్ణస్వామీ, తేజ్ బహదూర్ సప్రూ అంతటి వాడవుతాడా. డౌన్ విత్ లాకాలేజ్. నువ్వొక నిరాశావాదివి అంటాడు సోమయాజులు. డబ్బుంటే తనూ ఆశావాదే.........

క్లాసు ఐపోయింది. తను వరండాలో నడుస్తున్నాడు.' హల్లో మిస్టర్ ఆంజనేయులూ అని పలకరించింది స్నేహితురాలు చంద్ర. హలో హవ్‌డు యూ డూ అన్నాడు తను. "నాకు చాలా ఆకలిగా వుంది. లంచ్‌హోమ్‌లో టిఫినుతిందాంరండి" అంది చంద్ర. ఇద్దరూ నడుస్తున్నారు. మాంజనేయులికి చాలా గర్వంగా వుంది; ఇంతమంది అబ్బాయిల మధ్య ఒక అందమైన స్త్రీతో ఈవిధంగా నడవటం. ఒక స్త్రీని పట్టుకుని ఆమెమీద ప్రేమను జీవితంలో అన్ని విలువలకంటె ఎక్కువచేసుకుని సర్వప్రపంచాన్నీ ఆమెకోసం వొదులుకోగల ధైర్యంతో ఆమెను కోరడం జీవితంలో ఒక పెద్ద అనుభవం. ఈలేత యవ్వనంలో ఈ ఆడవాళ్లు నాకంలో అప్సరసలకంటె అందంగా కన్పించి ఏవేవో భావాలు కలిగించి నరాలలో వేడిపుట్టించి రాత్రిళ్లు నిద్ర పట్టకుండా చేస్తారు. ఆ మరారి ఘనమద ధనుస్సుబోలిన చంద్రదేహం. చంద్ర ఎర్రని పెదవులూ, మెరిసే చంపలూ అతనికి మత్తు కల్గిస్తున్నాయి. ఆ చీరలో మిస్టరీ తెలుచుకుంటూవుంటే మాటలు తడబడుతున్నాయి. "చంద్రా ఇటు వొకసారి చూడు. నీవు లేని నా హృదయము వల్లకాడు" అన్నాడు. చంద్ర కిలకిల నవ్వి "యూ నాటీ బోయ్"అంది. ఆమాటలు అతనికి ద్రాక్షారసంలా వున్నాయి. "అవును. నీకోసమైనా ఈ కాలేజీలో వుండిపోతా. నువ్వెన్నాళ్ళు ఈ కాలేజీలో వుంటే అంతకాలం ఇక్కడే వుంటాను." అనుకున్నాడు.

మళ్ళీ మర్నాడు బస్సుకోసం రెండు గంటలు నిలబడి కాళ్ళు నొప్పులు పుట్టే వరకూ మాంజనేయులికి ఈ అభిప్రాయం మారదు. ★

## సవరణ

5-8-53 సంచికలో, 38 వ పేజీలో, "దీర్ఘాయువు" అనే కథ మొదటి పేరాలో, "దేవదత్తుడనే ఆయన దానికి రాజు" అని పొరపాటున ముద్రింప బడినది. "బ్రహ్మదత్తుడనే ఆయన..." అని చదువుకోవలెనని ప్రార్థన.

ఒకరు:- "ఏరా, భాయ్, ఆంధ్ర రాజధాని మార్చేస్తారట?"

రెండవవారు:- "ఔనట"

ఒకరు:-"ఎక్కడ నుంచి?"

రెండవ:- "అదేమో!"

ఒకరు:- "ఎక్కడికి?"

రెండ:- "అదీ తెలియదు!"

శ్రీ క. సత్యనారాయణ, విజయనగరం.

తండ్రి: ఏరా! ఇంత రాత్రప్పుడు వుత్తరం పోస్టు చేస్తున్నావు?

కొడుకు: దీనికి స్టాంపులేదు పగలయితే ఎవరన్నా చూస్తారని ఇప్పుడు పోస్టు చేస్తున్నా! నాన్నా!

పి. సుబ్బారావు, విజయవాడ.